కున్నాను. ఆర్థిక సిద్ధాంతం లేని మనిషి ఒక మనిషి కాడు. నాకో స్వాతంత్ర్యం గమ్యం. నేను త్వరగా దొర్లిపోతాను గమ్యం వంకకి. ఎల్లా జీవితం సఫలం కాదో చూసి తీర్తా!"

"నువ్వు చూసి తీరేది నీ జీవిత సాఫల్యం కానే కాదు. ఎందరివో జీవితాల వినాశనం" అన్నాడు జనార్దనం.

"ఇతర్ల జీవితాల... నాకూ సంబంధ మేమిటి? నే బాగుపడితే తక్కిన వారికేం కొదువ?" అన్నాడు శర్మ.

"తక్కినవారు చెడితేనే నువ్వు బాగు పడడం. నీ లాభాలు ఒరుల నష్టాలు. వారి ఆక్రందనే నీ అర్జన! ఇందాక హెచ్చు ధరల గూర్చి గోల పెట్టావు చూశావూ! అల్లాగే నిన్ను గురించి అందరూ గోల పెడతారు. నిన్ను బ్రహ్మరాక్షసు డంటారు. పీడించుకు తింటున్నా వంటారు. కడుపు మిక్కిలి మండితే, నీ భాండాగారం యావత్తూ అర్థరాత్రి లూటీచేసి పారేస్తారు. ఒకవేళ హత్యకూడా చెయ్యబడవచ్చు నువ్వు. వీటన్నిటికన్నా, ప్రస్తుతం నువ్వు చేస్తున్న నౌకరీయే ఉత్తమం. ఎవ్వరూ నిన్ను చూసి దుఃఖించరు. ... ఇతరులు నిన్ను చూసి దుఃఖించినంత కాలం, నువ్వెంత దుఃఖించినా ఫర్వాలేదు" ఒక్క లెక్చర్ దంచాడు జనార్దనం.

గిర్రున తిరిగాడు శివసుందరశర్మ. గబగబా సీరపాణి వెండి బంగారు దుకాణం చేరుకుని, జేబులోని నోట్లకట్టను విసిరేసి, గంటక్రింద చెలామణీచేసిన గాజుల జత వాపసు చెయ్యమని అడిగాడు.

"క్షమించండి బాబుగారూ! బంగారు ధర పెరిగిపోయింది. మరి పదిరూపాయ లివ్వండి, వాపసుచేస్తా మీ జత" బదులిచ్చాడు బేహారి.

కథానిక

# గ్రహాలూ - రాసులూ

**ఇచ్ఛాపురపు జగన్నాథరావు**

శ్రీపతి సావిత్రిని వివాహం చేసుకోబోతున్నాడంటే నేను ఆశ్చర్య పడలేదు. మొదటి కారణం (నేను ఆశ్చర్య పడక పోవడానికి) సావిత్రి చాలఅందమైన అమ్మాయి అవడము. రెండోది ఆమె చదువుకున్న దవడము.

క్లబ్బులో ఒక ప్రక్కకి పిలిచి శ్రీపతి తొలినాడు అన్నాడు, "నీతో చిన్న విషయం చెప్పాలి" అని.

చెప్పమన్నాను.

"సావిత్రిని నేను వివాహం చేసుకోవడం గురించి నీ ఉద్దేశం ఏమిటి?" అన్నాడు.

వాడు "సావిత్రిని గురించి నీ ఉద్దేశం ఏమిటి?" అని నన్నడగలేక ఇలాగ అడిగాడని తెలుసు. సావిత్రితో నాకున్న పరిచయాన్ని బట్టి అన్నాను: "నీ జన్మ తరించింది. శుభస్య శీఘ్రం అన్నారు. త్వరగా కానీ" అని.

ఆ మర్నాడు శ్రీపతి కొంచెం బిక్కమొహం వేశాడు. ఏదో జరిగిందనుకుని, నేనే అడిగాను, "ఏం, ముఖం వేలవేశావ్?" అని.

ఆవేళ అనుకున్నట్టుగానే సావిత్రి తండ్రి వెంకట రమణయ్యగారు, గోపాలంగారికి (శ్రీపతి తండ్రి) సావిత్రిని శ్రీపతికిచ్చే ఉద్దేశం ఉందనీ, వచ్చి పిల్లని చూసుకోవలసిందనీ కబురు పెట్టారట. దురదృష్టవశాత్తు గోపాలంగారు సిద్ధాంతితో కలిసి మర్నాడు వస్తామని కబురు పెట్టారట వెంకట రమణయ్యగారికి.

"సిద్ధాంతి అంటే మా నాన్నకి చాలా గురి ఉంది. ఏదో చవటకబురు చెప్పి అమ్మాయిలో ఏదో అవలక్షణం ఉందని చెప్పేడంటే ఏమిటి దారి?" అంటాడు శ్రీపతి.

సిద్ధాంతి మా వూళ్ళో చాలా పలుకుబడి ఉన్నవాడు. జ్యోతిషమూ, సాముద్రికమూ అతని ఆయుధాలు. ఊరిలో పెద్దలు గెడ్డం

గియించుకోవడం మొదలు కోడళ్ళని వెదుక్కునే వరకూ ఆయనమాటని జవదాటే వారు కాదు. గోపాలంగారికి శాస్త్రంలో నమ్మకం ఉన్నా లేకపోయినా సిద్ధాంతి గారిలో మాత్రం నమ్మకం కద్దు. అదే మావాడి గోల.

“సరే, ముందే భయపడ్డం ఎందుకూ? రేపు జరిగేదంతా చెప్పు. దాన్నిబట్టి కార్యక్రమం ఆలోచిద్దాం. అంత ముంచుకువస్తే నేనున్నాగా” అని ధైర్యం చెప్పాను.

ఏమైనాసరే. శ్రీపతికి పచ్చి వెలగకాయ గొంతుకలో పడినట్లుంది.

సరే. ఆ మర్నాడు జరగవలసినదంతా జరిగింది. సరిగ్గా సిద్ధాంతి చెప్పిన ముహూర్తం ప్రకారం శకునమూ అవీ మాసు''ని గోపాలం గారు వెళ్ళారు సిద్ధాంతితో సహా.

“అమ్మాయిని నడవమనండి” అన్నాడు సిద్ధాంతి. పెళ్ళికూతురు నడిచింది. “చేతులు చూడాలి” అని సిద్ధాంతి ఆమె సాముద్రిక లక్షణాలనికూడా పూర్తిగా పరీక్షించాడు. ఆమె జాతకం అడిగిచూచాడు.

“తరవాత కబురు పంపుతాం” అన్నాడు సిద్ధాంతి. ఇద్దరూ బయలుదేరి వచ్చేశారు.

సిద్ధాంతి పరీక్ష ప్రకారము తేలిన అంశమేమిటంటే, సావిత్రికి పుట్టబోయే మొదటి పిల్లవాడు పుట్టిన వారంరోజులకి చచ్చిపోతాడు అని.

సరే. సావిత్రిని చేసుకోవడమా, మానడమా అని మీమాంసలోపడ్డారు. మా శ్రీపతి గుండెలో రాయిపడింది. మొదటి మనుమడు దక్కకపోడం గోపాలంగారికి అట్టే నచ్చలేదు.

నాకు విచారం కలిగింది. గోపాలంగారి దగ్గర నాకు చాలా చనువు ఉంది. అంచేత ఆయనతో వాదించి ఈ సంబంధం తప్పిపోకుండా చేద్దామని ఆ మర్నాడు శ్రీపతి ఇంటికి వెళ్ళాను.

నేను వెళ్ళేటప్పటికి గోపాలంగారూ, సిద్ధాంతీ మాట్లాడుతున్నారు. “కుజవీక్షణం ఫలితం తప్పదు బాబూ” అంటున్నాడు సిద్ధాంతి.

ఇదే సమయమని అన్నాను: “పోనిస్తురూ ఈరోజుల్లో పిల్లకీ పిల్లవాడికీ ఇష్టమా కాదా అని చూడాలిగాని ఈ చాదస్తాలేమిటండీ?”

సిద్ధాంతి ముఖం నల్లబడింది. ఒక్కక్షణం నిశ్శబ్దంగా ఉండిపోయి అన్నాడు: “శాస్త్రాన్ని కాదంటారా?”

నా ఉద్దేశం అది కాదని సూచించడానికి నవ్వుతూ, “శాస్త్రాలకి నిజం, అబద్ధం ఏమిటి లెద్దురూ” అనేశాను.

సిద్ధాంతిని రక్షించడానికి గోపాలంగారు సిద్ధపడుతూ, “నీకు శాస్త్రంమీద విశ్వాసం లేదు కాబోలు” అన్నారు.

“లేకపోవడమేమిటండీ? కావలిస్తే సిద్ధాంతిగారినే అడగండి” అన్నాను.

సిద్ధాంతి తెల్లబోయాడు. “ఎప్పుడో ఒకసారి తప్పితే అస్తమానం తప్పుతుందా శాస్త్రం?” అన్నాడు.

గోపాలంగారు గ్రహించారు. చిన్నగా నవ్వుతూ, “ఏమిటి పంతులూ అసలు సంగతి?” అన్నారు.

“సిద్ధాంతిగారికి కోపంరాదంటే చెప్తాను” అన్నాను.

“నా కోపం వస్తేమాత్రం ఆగుతారా? కానియ్యండి” అన్నాడు సిద్ధాంతి.

“జరిగిన సంగతి ఏమిటంటే, నాలుగేళ్ళ క్రితం నేను అవివాహితుడిగా ఉన్నప్పుడు శారదని పెళ్ళి చేసుకుందా మనుకున్నాను. ఆమె తండ్రికి నేనంటే చాలా ఇష్టం. నేనంటే ప్రాణం ఇచ్చేది శారద. పెళ్ళి మాటలు ప్రారంభించారు.

“ఆ సమయంలో సిద్ధాంతి “అమ్మాయి జాతకం చూడాలి” అని పుచ్చుకుని “అమ్మాయికి పెళ్ళి చేసుకున్న పదకొండు మాసాలకి వైధవ్యం తప్పదు” అన్నాడు.

“మావాళ్లు సుతరామూ ఒప్పుకోలేదు ఆ సంబంధానికి. నిజం చెప్పకేం. నాకే భయం వేసింది.

“నా కిష్టం లేకపోయినా తరువాత త్వరలోనే నా వివాహం అయిపోయింది. ఆ నెలలోనే శారదకీ వివాహం అయింది.

“నలభై అయిదు మాసాలయినా శారద మొగుడు దుక్కల్లే ఉన్నాడు; సరిగదా ప్లీడరుగా చిన్న ప్రాక్టీసుతో ఉంటూన్నవాడల్లా

మేజిస్ట్రేటు అయికూర్చున్నాడు.

"నా కథలో ఒక్క అక్షరం తప్పుందేమో సిద్ధాంతినే అడగండి" అన్నాను. సిద్ధాంతి మాత్రం ఏమంటాడు? "జాతకం తప్పు వెయ్యడం వల్ల శారద విషయం అలాగైంది" అన్నాడు. "సావిత్రి జాతకం రైటనడానికి ఆధారం ఏమిటి?" అన్నాను. సిద్ధాంతి చివాల్న లేచి వెళ్ళిపోయాడు. గోపాలంగారి మనస్సు కుదుటబడింది.

"వాడి మనస్సు కష్టపెట్టడం నాకూ ఇష్టం లేదు పంతులూ. కాని, నా మనస్సు ఒప్పలేదు. అనవసరంగా బాధపడ్డాను. వీలైనంత త్వరలో ముహూర్తం పెట్టిస్తాను" అన్నారాయన.

ఇలాగ శ్రీపతికీ, సావిత్రికీ తరువాత వివాహం అయిపోయింది. మరుసటి మాసం శ్రీపతికి రైల్వేలో ఉద్యోగం అవడమూ, జబ్బల్‌పూర్ వెళ్ళిపోవడమూ జరిగాయి.

మదరాసునించి వచ్చేస్తూ, విజయవాడ ప్లాట్‌ఫారమ్ మీద పచారుచేస్తున్నాను. అక్కడ ఆటోమాటిక్ వేయింగ్ యంత్రంమీద అందరూ బరువు చూసుకుంటున్నారు. నేనూ ఒక అణాకాసు యంత్రంలో పడేసి నిల్చుంటే ఒక టికెట్ వచ్చింది. నా బరువు కాక ఇంకా యేమో దానిమీద రాసి ఉంది. దాని అర్థం "గొప్ప ఓటమిని ఒప్పుకోవలసిన నిముషం వస్తూంది" అని.

ఆ జోస్యం చూసేసరికి ఆరేళ్ళ క్రిందట జరిగిన ఈ కథ అంతా జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నాను. టైమవుతూందని తొందరగా బండి దగ్గరకి వస్తూంటే ఎవరో నా చెయ్యిపట్టుకున్నారు పిలుస్తూ.

మొదట గుర్తించ లేకపోయాను. కానీ, వాడు శ్రీపతే!

"నీకు వెయ్యేళ్లు ఆయుస్సురా" అన్నాను.

తరువాత క్షేమసమాచారాలు మాట్లాడి వెళ్ళిపోతున్నానని తెలియగానే శ్రీపతి రైల్వే పోర్టరని పిలిచి నా సామాను దింపివేశాడు. ఎంతచెప్పినా వెళ్ళనిస్తేనా?

శ్రీపతి తన ఉద్యోగం సంగతీ, జబ్బల్‌పూర్ నించి కలకత్తా, ఖరగ్‌పూరు, మద్రాసూ, విజయవాడ, ఎలాగ ట్రాన్స్‌ఫరు చేయించుకున్నాడో అంతా చెప్పుకుపోతున్నాడు.

నా మనస్సులో అనుమానం చాలా బాధ పెడుతోంది. సిద్ధాంతి జ్యోతిషం మాట ఏమయిందన్న ఆ ఒక్క విషయమూ తప్ప అన్ని విషయాలూ మాట్లాడుతూ ఇంటికి తీసికెళ్లాడు.

సావిత్రి ఆప్యాయంగా ఆహ్వానించింది. నాకై నేను దిగనందుకు దెబ్బలాడింది కూడా. కాని అసలు విషయం ఆమే కదపదే?

టీ త్రాగి కూర్చున్నాము. "గోపిని తీసుకురా" అని పురమాయించాడు శ్రీపతి.

"ఎన్నో ఏడురా?" అన్నాను మహానందంతో (నా వాదన ఫలించి వాడు బ్రతికి బాగున్నందుకు గర్వంతో) గోపిని ముద్దాడుతూ. వాడూ మంచి బాగా ఉన్నాడు.

"రెండో ఏడురా" అన్నాడు.

ఇక ఉండబట్టలేక నవ్వుతూ అనేశాను- "అయితే దైవకృపవల్ల సిద్ధాంతి జోస్యం అబద్ధం అయిందన్న మాటే" అని.

నవ్వుతూన్న శ్రీపతి ముఖమూ, సావిత్రి ముఖమూ ఒక్కసారి ముడుచుకున్నాయి. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడిచాక "మొదటి వాడు పోయాడ్రా ఏడో రోజున. అది పెళ్ళి అయిన రెండో యేట జరిగింది" అన్నాడు.

నా నడుం బెణికినట్టయింది. జేబులో బరువు టికెట్ చేతికి తగిలింది. లోకంనిండా ఒక్క క్షణం గ్రహాలూ, రాసులూ మాత్రం కనిపించాయి!

అమెరికాను మొట్టమొదట కనుగొన్న అతడు కొలంబస్ అని ప్రతీతి. ఇది నిజం కాదని, చార్లకాఫ్ అనే రష్యను నావికుడు కొలంబస్ కంటే ఒక రోజు ముందే పశ్చిమ తీరాన్ని కనిపెట్టినట్లు యిటీవల మాస్కో రేడియో ప్రకటించింది.